విత్తన గోదాముల్లో తనిఖీలు

జూన్ 2న మళ్లీ జైలుకు.. నా తల్లిదండ్రులు జాగ్రత్త

ఢిల్లీ ప్రజలకు సీఎం కేజ్రీవాల్ విన్నపం

న్యూఢిల్లీ, మే 31: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై వచ్చిన తాను జూన్ 2న మళ్లీ జైలుకు వెళ్లబోతున్నట్టు ఆ రాష్ట్ర సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి వెళ్లి తీహార్ జైలులో లొంగిపోతున్నట్టు తెలిపారు. ఈసారి జైలులో తనను మరింత వేధించే అవకాశం ఉన్నదని తెలిపారు. 'జైలుకు వెళ్లినా ప్రజల గురించే ఆలోచిస్తా. ప్రస్తుతం మీకు అందుతున్న సేవ లేవీ ఆగబోవని హామీ ఇస్తున్నా. త్వరలో నా తల్లులు, సోదరీమణులకు నెలకు రూ.1,000 చొప్పున అందుతాయి' అని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

కేయూలో పరీక్ష పత్రాలు బయటకు

హనుమకొండ చౌరస్తా, మే 31: కాకతీయ యూనివర్సిటీలో పైసలకు అలవాటు పడిన ముగ్గురు దినసరి వేతన కూలీలు ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి జవాబుపత్రాలు బయటకు పంపిన ఘటన కేయూలో దుమారం రేపుతున్నది. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి, కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చిం ది. విద్యార్థులు పరీక్షలో రాసిన జవాబు పత్రాలను ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న దినసరివేతన కూలీలు సునీల్, రాణాప్రతాప్, శ్రీధర్ తిరిగి వారికి చేరవేసి మళ్లీ రాయించి ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుం డా వాటిని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు చేర్చినట్టు తెలుస్తున్నది. ముగ్గురు దినసరి కూలీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. యూనివర్సిటీలో జరిగిన ఘటనపై ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ సీరియస్ అయ్యారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో జరిగిన ఘటనపై ఆరా తీసినట్టు తెలుస్తున్నది.

అక్రమ నిల్వలు అరికట్టేందుకు చర్యలు : కలెక్టర్, ఎస్పీ

ఎదులాపురం/జైనథ్(బేల), మే 31: పత్తి విత్తనాల అక్రమ నిల్వలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఫర్టిలైజర్ డీలర్లకు చెందిన 36 గోదాములను శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం సంబంధిత శాఖల అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తనాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువుల గోదాముల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని నియమించి విత్తనాలు అక్రమ రవాణా కాకుండా నిఘా పెట్టినట్టు తెలిపారు. 55 కంపెనీలకు చెందిన 128 రకాల 14.40 లక్షల పత్తి ప్యాకెట్లు అందుబాటులో ఉండగా 4 లక్షల ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఆర్‌సీహెచ్ విత్తనాలకు డిమాండ్ ఉన్నదని, నిరుడు 1.20 లక్షల ప్యాకెట్లు విక్రయించగా ఈ ఏడాది 1.50 లక్షల ప్యాకెట్లు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా శంకర్ గూడా, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, లక్ష్మీపూర్, ఘన్‌పూర్ వద్ద చెక్‌పోస్టుల ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నట్టు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా బేలలోని విత్తనాల షాపులో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి పీఎస్‌లో పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న పోలీసులు

18 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఉండవెల్లి/కొడంగల్, మే 31 : గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన డ్రైవర్ కోటేశ్వరావు బొలెరో వాహనం నంద్యాల జిల్లాలో 18 క్వింటాళ్ల పత్తి (లూజ్) విత్తనాల లోడ్‌తో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు బయలుదేరింది. ముందస్తు సమాచారంతో వ్యవసాయ అధికారులు, పోలీసులు గురువారం రాత్రి 11 గంటలకు పుల్లూరు టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. వీటి విలువ రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో గడువు తీరిన 10 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకొన్నట్టు వ్యవసాయ శాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు, గడువు తీరిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదిలాబాద్‌లో ఓ డీలర్ రాశి 659 పత్తి విత్తనాలను రైతులకు విక్రయించకుండా, వ్యవసాయ అధికారులకు స్టాక్ వివరాలను చూపించకుండా మోసం చేసినందుకు కేసు నమోదు చేసినట్టు వన్ టౌన్ సీఐ కే సత్యనారాయణ తెలిపారు.

విత్తనాలు బ్లాక్‌లో అమ్మితే లైసెన్స్‌లు రద్దు

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి హెచ్చరిక

ఎదులాపురం, మే 31: విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి బ్లాక్‌లో విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దవుతాయని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఆయన కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విత్తనాల షాపులను పరిశీలించారు. స్టాక్ వివరాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయించడం, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే లైసెన్సుల రద్దుతోపాటు కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. రైతులు కోరుకునే కంపెనీ విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఒకే రకం విత్తనాలను రైతులు కోరుకోవడంతోనే విత్తనాల కొరత ఏర్పడిందని తెలిపారు.

ఫార్మసీకి కొత్త ఫీజులు

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఫార్మసీ సహా పలు కోర్సుల్లో కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. బీ ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులతోపాటు, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ) కోర్సుల ఫీజులు సైతం పెరిగాయి. ఇవే కాకుండా ఎం ఫార్మసీ, ఎం ఆర్క్ వంటి కోర్సుల ఫీజులు కూడా పెరిగాయి. ఆయా కోర్సుల్లో చేరే వారు ఇకనుంచి పెరిగిన ఫీజులను కట్టాల్సిందే. వాస్తవానికి ఈ ఫీజులు గతేడాదే పెరిగాయి. కానీ అప్పటికే కౌన్సెలింగ్ పూర్తయ్యింది. దీంతో కౌన్సెలింగ్ సమయంలో పెంచిన ఫీజులను వర్తింపజేయలేదు. కానిప్పుడు కౌన్సెలింగ్ సమయంలోనే విద్యార్థులు పెంచిన ఫీజులు కట్టాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ గల వారికి ఫీజులను మినహాయిస్తారు.

పెరిగిన ఫీజుల వివరాలు

- బీ ఫార్మసీ కోర్సును 120 కాలేజీల్లో నిర్వహిస్తున్నారు. కనిష్ఠ ఫీజు రూ. 45 వేలు, గరిష్ఠ ఫీజు రూ.1.10లక్షలుగా ఉన్నది.
- ఫార్మా(డీ)కోర్సును 68 కాలేజీల్లో నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు కనిష్ఠ ఫీజు రూ. 55వేలు, గరిష్ఠ ఫీజుగా రూ.1.25లక్షలు ఖరారుచేశారు.
- ఎం ఫార్మసీ కోర్సును నిర్వహించే కాలేజీలు రాష్ట్రంలో114 ఉండగా, గరిష్ఠ ఫీజు రూ.1. 25లక్షలు, కనిష్ఠ ఫీజు రూ.1.10 లక్షలుగా ఉన్నది.
- ఫార్మసీ(డీ)పీబీ కోర్సును 29 కాలేజీల్లో నిర్వహిస్తున్నారు. వీటిల్లో గరిష్ఠ ఫీజు రూ.1.15లక్షలుండగా, కనిష్ఠ ఫీజు రూ.68వేలుగా ఉంది.
- ఎంఆర్క్ (ఆర్కిటెక్చర్) కోర్సును రాష్ట్రంలో ఏడు కాలేజీల్లో నిర్వహిస్తున్నారు. వీటిల్లో గరిష్ఠ ఫీజు రూ. 80 వేలు, కనిష్ఠ ఫీజు రూ.70వేలుగా ఉంది.
- బీఆర్క్ కోర్సును 9కాలేజీల్లో నిర్వహిస్తుండగా గరిష్ఠంగా రూ.1.20లక్షలు, కనిష్ఠంగా రూ.65వేలు.
- బీఎఫ్ఏ కోర్సును మూడు కాలేజీల్లో నిర్వహిస్తుండగా మూడింటిలోనూ రూ.35వేలు ఫీజు ఉన్నది.

బడిబాట షెడ్యూల్ మార్పు!

హైదరాబాద్, మే 31(నమస్తే తెలంగాణ): విద్యాసంవత్సరం ప్రారంభంలో నిర్వహించే బడిబాట షెడ్యూల్ మారనుందా..? అంటే అవుననే అంటున్నాయి విద్యాశాఖవర్గాలు. ఇందుకు సంబంధించిన ఫైల్ సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలనలో ఉన్నది. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే బడిబాట షెడ్యూల్ మారే అవకాశమున్నది. జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయించి, షెడ్యూల్ సైతం ప్రకటించింది. కాగా, విద్యాశాఖ బడిబాట ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎన్నికలకోడ్ అమల్లో ఉండటంతో బడిబాటలో సీఎం పాల్గొనడం వీలుపడదు. ఈనెల 6తో ముగియనున్న ఎన్నికలకోడ్ తర్వాతే బడిబాట ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో బడిబాట షెడ్యూల్ మార్పునకు సీఎం అనుమతి కోరినట్టు తెలిసింది. మారిన షెడ్యూల్‌ను శనివారం విడుదలచేసే అవకాశాలున్నట్టు సమాచారం.

మూతపడిన బడులను తెరిపించే కార్యాచరణేది: టీపీటీఎఫ్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మూతపడిన బడులను తెరిపించేందుకు కార్యాచరణ ప్రణాళికేదని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. బడిబాట షెడ్యూల్‌లో ఈ అంశంపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటించలేదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, పీ నాగిరెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలు వేసి విద్యారంగ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేల స్కూళ్లను మూసివేశారని, టీచర్ పోస్టులు కనుమరుగయ్యాయని, ప్రభుత్వం వెంటనే మూసివేసిన బడులను తెరిపించాలని డిమాండ్ చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్ల విడుదల

హైదరాబాద్, మే 31(నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్లు విడుదలయ్యాయి. ఐఐటీ మద్రాస్ వీటిని శుక్రవారం వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ప్రొవిజినల్ ఆన్సర్ కీని ఈనెల 2న విడుదల చేస్తారు. విద్యార్థులు ఈనెల 3 వరకు కీపై అభ్యంతరాలు తెలుపవచ్చు. 9న ఫలితాలు విడుదల చేస్తారు. కాగా ఈ పరీక్షను మే 26న నిర్వహించారు.

'గణితం బోధించాలనడం దురదృష్టకరం'

హైదరాబాద్, మే 31 (నమస్తేతెలంగాణ): భౌతికశాస్త్రం టీచర్లు గణితం బోధించాలనడం దురదృష్టకరమని ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అభిప్రాయపడింది. ఈ ఉత్తర్వులను వెంటనే సవరించాలని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌సింగ్, కోశాధికారి టీ శ్రీనివాసచారి, ప్రతినిధులు జగదీశ్, శ్రీకాంత్‌రెడ్డి, మధు ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మెదక్ మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన

మెదక్ రూరల్, మే 31: పుట్టిన శిశువు మృతికి డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ దవాఖాన ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మెదక్ జిల్లా హవేళీఘన్‌పూర్ మండలం కూచన్‌పల్లికి చెందిన గర్భిణి భవాని మే 28న మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ దవాఖానలో అడ్మిట్ కాగా, 29న ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చింది. తర్వాత కొన్ని గంటలకు బాబు జ్వరం బారిన పడగా వైద్యురాలు అరుణనాయుడు ఎలాంటి చికిత్స చేయకపోవడంతో శిశువు శుక్రవారం మృతిచెందాడని తండ్రి శ్రీధర్ తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందిందని ఆగ్రహించిన బంధువులు, కుటుంబసభ్యులు శుక్రవారం దవాఖాన ఎదుట రెండు గంటల పాటు ఆందోళనకు దిగారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ స్పందించి, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూపరింటెండెంట్, పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు

కడుపు కోతలను అరికట్టండి

- సాధారణ ప్రసవాలపై దృష్టిపెట్టండి
- వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ఆదేశం

నమస్తే ఎఫెక్ట్

జగిత్యాల, మే 31 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో అత్యధిక శాతం సిజేరియన్లు ఉంటున్నాయని 'మళ్లీ మొదలైన కడుపు కోతలు' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, వైద్యాధికారులు, జిల్లా పాలనాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనాన్ని సోషల్ మీడియాలో ట్యాగ్ చేశారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

> మొదటిపేజీ తరువాయి...

అప్పుతెచ్చి వ్యవసాయం చేశాడు. రెండేండ్లుగా ఆశించిన దిగుబడి రాక అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం మేక గుడిసె వద్దకు వెళ్తున్నానని చెప్పి పాత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం గ్రామానికి చెందిన అవిరెండ్ల ఉపేందర్ (30) తనకున్న అరెకరంతోపాటు గ్రామంలో మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో ఉపేందర్ అప్పటికే పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే దారిలేక తీవ్ర మనస్తాపం చెందిన ఉపేందర్ గురువారం రాత్రి పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉపేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి

- ప్రిపరేషన్‌కు నెలరోజులు గడువు ఇవ్వండి
- టీఎస్‌పీఎస్సీని కోరిన బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష వాయిదా వేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ట్వీట్ చేశారు. గ్రూప్-1 నిర్వహించే రోజే.. ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష కూడా ఉందని గుర్తుచేశారు. చాలా మంది అభ్యర్థులు ఐబీ పరీక్షకు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు (ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ శాఖ) లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాలుగు నెలల నుంచి విధులు నిర్వహించారని తెలిపారు. దీంతో వారంతా ప్రిపేర్ కావడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ప్రిపేర్ కావడానికి కనీసం నెల రోజుల సమయం ఇచ్చి, ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేయాలని కోరారు. గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ టీఎస్‌పీఎస్సీని కోరారు. కాగా, పలు ప్రభుత్వ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామకపత్రాలు జారీ చేసి, వారికి న్యాయం చేయాలని సర్వీస్ కమిషన్‌ను కోరారు. 2017 పీఈటీ అభ్యర్థుల సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు.

టీచర్ల సమస్యలపై ఎందుకింత నిర్లక్ష్యం

ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తుందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న వారికి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. టీచర్లు పదే పదే హైకోర్టుకు వెళ్లకుండా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, న్యాయపరమైన చిక్కులు లేకుండా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

మూడు వారాలు వాయిదా వేయండి: బస్సు యాత్ర కన్వీనర్

ఖైరతాబాద్, మే 31: గ్రూప్-1 ప్రిలిమినరీని మూడు వారాల పాటు వాయిదా వేయాలని నిరుద్యోగుల బస్సు యాత్ర కన్వీనర్ జనార్ధన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల షెడ్యూల్‌తో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. దీంతో వారు గ్రూప్-1 పరీక్షలకు సరిగా సన్నద్ధం కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో ఇంద్రకుమార్, అశోక్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 హాల్‌టికెట్ల పంపిణీ

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించడానికి టీఎస్‌పీఎస్సీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1న మధ్యాహ్నం 2 గంటల నుంచి అధికారిక వెబ్‌సైట్ tspsc.gov.inలో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని 563 పోస్టుల భర్తీ కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేయగా, ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్నారు. అక్టోబర్ 21 నుంచి మెయిన్ పరీక్షలను నిర్వహించడం కోసం ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది.

మాజీ ఆర్చ్‌బిషప్ తుమ్మబాలకు ఘన నివాళి

- పార్థివదేహం వద్ద నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సంతాపం తెలిపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసలికా చర్చిలో అంత్యక్రియలు

తుమ్మ బాల భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మారేడ్‌పల్లి, మే 31: హైదరాబాద్ మాజీ ఆర్చ్ బిషప్ తుమ్మబాల(80) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. వరంగల్ బిషప్‌గా 25 ఏండ్లపాటు పనిచేసిన తుమ్మబాల అంత్యక్రియలు శుక్రవారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసలికా చర్చిలో నిర్వహించారు. ముందుగా, ఆయన పార్థివదేహాన్ని వరంగల్ నుంచి సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు తీసుకొచ్చి, అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ పలువురు ప్రముఖులు, క్రైస్తవులు ఆయన పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఆ తర్వాత కార్డినల్, హైదరాబాద్ ఆర్చ్ బిషప్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది క్రైస్తవులు, తుమ్మబాల బంధువులు, బిషప్‌లు రెవరెండ్ దమన్ కుమార్, రెవరెండ్ ప్రకాశం, రెవరెండ్ బాల, డాక్టర్ జయరావులతోపాటు మత పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలో అత్యున్నతస్థాయికి ఎదిగారు : కేసీఆర్

హైదరాబాద్ ఆర్చ్ బిషప్, మోస్ట్ రివరెండ్ తుమ్మబాల మృతికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. వరంగల్ వాసి అయిన తుమ్మబాల.. క్రీస్తు సేవకోసం తన జీవితాన్ని అర్పించి, తాను విశ్వసించిన ఆధ్యాత్మిక సేవలో అత్యున్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న పరిచయాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులకు, బంధుమిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తుమ్మబాల మృతికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు.

క్రైస్తవ సమాజానికి తీరని లోటు: రేవంత్

బిషప్ తుమ్మ బాల మృతి క్రైస్తవ సమాజానికి, అభిమానులకు తీరని లోటు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజ నిర్మాణంలో తుమ్మబాల సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

నార్కోటిక్ బ్యూరో డీజీ శాండిల్య పదవీ విరమణ

- పదవీకాలం పొడిగించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- టీఎస్ న్యాబ్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సీపీ కొత్తకోట

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ జనరల్ సందీప్‌శాండిల్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని తన చాంబర్‌లో టీఎస్ న్యాబ్ సిబ్బంది ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా సందీప్‌శాండిల్య సేవలను, వృత్తిలో ఆయన పాటించిన నిబద్ధత, నిజాయితీని కొనియాడారు. ఢిల్లీకి చెందిన సందీప్ శాండిల్య.. 1993 ఐపీఎస్ బ్యాచ్ ఆఫీసర్. మొదట గుంటూరులో, ఆ తర్వాత నల్లగొండ, ఆదిలాబాద్, కృష్ణా, సౌత్ జోన్ డీసీపీగా పనిచేశారు. సీఐడీ, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో, అడిషనల్ పోలీస్ కమిషనర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ లో సేవలందించారు. 2016 నుంచి 2018 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీగా పనిచేశారు. జైళ్లశాఖ డీజీగా మూడు నెలలపాటు పనిచేసిన సందీప్ శాండిల్య.. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా, హైదరాబాద్ సీపీగా విధులు నిర్వహించారు. ముక్కుసూటితనం కలిగిన అధికారిగా పేరు న్న సందీప్‌శాండిల్యను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో కు డైరెక్టర్‌గా నియమించింది. ఇటీవల డీజీపీ ర్యాంకుతో పదోన్నతి పొందిన సందీప్ శాండిల్య.. శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో టీఎస్‌న్యాబ్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. అయితే, డీజీ సందీప్ శాండిల్య నిబద్ధత, నిజాయితీని దృష్టిలో ఉంచుకొని టీఎస్‌న్యాబ్ డైరెక్టర్‌గా ఆయన్నే రెండేండ్లపాటు కొనసాగించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉత్తర్వులు వెలువడనున్నాయి.

నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): జాతీయస్థాయిలో మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-25కు సన్నద్ధమవుతున్నవారికి ఈ నెల 5 నుంచి 9వరకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఏ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ వసతి సౌకర్యాన్ని కూడా ఉచితంగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. బైపీసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులంత